**పుట : 60-63, జి. రామలక్ష్మి - హైదరాబాదు**

## దయార్ద్ర హృదయులు

ఒక గ్రామంలో శేషయ్య, కాంతమ్మ అనే యిద్దరు వృద్ధ దంపతులు ఉండేవారు. వాళ్ళు చాలా దయామయులు. అడిగిన వారందరికీ, లేదనకుండా దానధర్మము చేసేవారు. పాపం, వారికి వృద్ధాప్యము వచ్చినా సంతానము లేదు ఆ గ్రామంలోని వాళ్ళెవరూ, ఏదానధర్మాలు చేసెడివారు కారు. ఆ గ్రామం వాళ్ళు, చివరికి, పిల్లికి కూడా బిచ్చము పెట్టని రకాలు. అందుచేత, దాన ధర్మాలుచేసే, యీ వృద్ధులంటే ఎవరికీ గిట్టేది కాదు. అందుకని, యీ దంపతులిద్దరూ, గ్రామానికి దూరంగా, ఒక చిన్న యింట్లో ఉండేవారు. యిలా ఉండగా ఒకసారి, యిద్దరు బిచ్చగాళ్ళు, ఒక యింటి వద్ద ఆగి, "అమ్మా ఏదయినాధర్మం చెయ్యండమ్మా?" అని అడిగారు. అదివిని, లోపలినించి ఒక మనిషి బయటకి వచ్చి, యిది ఏమైనా ధర్మసత్రం అనుకున్నావా? దానధర్మాలు చేయటానికి?, పొండి," అంది కోపంగా, అప్పటికీ వాళ్ళు కదలక; "కనీసము మంచినీళ్ళయినా యివ్వండమ్మా! బాగా దాహంగా ఉంది," అన్నారు. నీళ్ళూ లేవూ, ఏమీలేవూ, పొమ్మంటూంటే మిమ్మల్ని కాదూ? అలా అడుక్కోకపోతే, ఏదైనా పని చేసుకుని బ్రతకరాదూ?" అంటూ కోపంగా, విసురుగా, లోపలికెళ్ళి తలుపేసేసుకుంది. తరువాత ఆ బిచ్చగాళ్ళిద్దరూ, రెండవ యింటికి వెళ్ళారు. వాళ్ళుకూడా, అలాగే తిట్టి, పొమ్మన్నారు. యీ విధంగా వాళ్ళు ఎన్నో యిళ్ళు, తిరిగి చివరికి మిట్టమధ్యాహ్నా సమయమున, ఆ వృద్ధ దంపతుల యింటికి వెళ్ళి "అమ్మా, బాగా అలసి ఉన్నాము, సొమ్మసిల్లి పోతున్నాము, కాస్త తినటానికి ఏదయినా యిప్పించండమ్మా;" అని అడిగారు. అది విని శేషయ్య, బయటకివచ్చి "లోపలికి దయచేయండి;" అంటూ వాళ్ళని లోపలికికి తీసుకువచ్చాడు. ఆ వృద్ధ దంపతులు, వాళ్ళకి, అతిధి సత్కార్యములుచేసి, తమకని, వండుకున్న ఆహారమును వాళ్ళకూ పెట్టారు, వాళ్ళు ఎంతో ఆనందంతో ఆ ఆహారమును ఆరగించారు. అంతే! వెంటనే ఆయిల్లు ఎంతో కాంతివంతంగా ప్రకాశించినట్లయింది. అది చూసి, ఆ దంపతులు ఎంతో, ఆశ్చర్యపోయారు, వారి ఆశ్చర్యమును గ్రహించినవారై ఆ బిచ్చగాళ్ళు, "మేము ఈ గ్రామ ప్రజలను, పరీక్షించుటకై వచ్చిన పార్వతీ పరమేశ్వరులం. యీ గ్రామంలోని ప్రజలు దయాదాక్షిణ్యాలు, దానధర్మాలు చేయనివారు. అందుకే యీ గ్రామాన్ని ఒక చెరువుగానూ, యీ గ్రామపు ప్రజలను, చేపలగానూ, కప్పలుగానూ, మార్చదలిచాను!" అని తమ నిజస్వరూపమునుదాల్చారు. అది చూసిన ఆ దంపతులు, ఆశ్చర్యంతో, నోట మాటరాక, అలాగే నిశ్చేష్టులై చూస్తూ, చేతులెత్తి నమస్కరించారు. పార్వతీ పరమేశ్వరులు వారిని చూసి "మీ భక్తికి మీ యొక్క దయకు మెచ్చాము, మీకు ఏమి కావాలో కోరుకోండి" అన్నారు

ఆశీర్వదిస్తూ, దానికి ఆ ముసలి దంపతులు "మా కర్తవ్యం మేము నిర్వర్తించాం. మాకేవరమో వద్దు" అన్నారు. నమస్కరిస్తూ.

"అలాకాదు, ఏదయినా కోరుకోండి. తప్పక ప్రసాదిస్తాము" అన్నారు పార్వతీ పరమేశ్వరులు. దానికి "మేము ఎలాగూ ముసలి వాళ్ళమయినాము. యింకా ఎంతోకాలము బ్రతకము. అందుకని వచ్చేపోయే బాటసార్లుకు మేమిద్దరమూ తియ్యని పళ్ళనూ, చల్లటి నీడనూ, యిచ్చే చెట్లుగా ఉండాలని వరమీయండి, అంతే చాలుమాకు!" అన్నారు.

వాళ్ళ దయార్ద్రబుద్ధికి, వాళ్ళ మంచితనానికీ మెచ్చి, పార్వతీ పరమేశ్వరులు సంతోషంగా వాళ్ళడిగిన వరాన్ని ప్రసాదించి అదృశ్యమైనారు.